మిల్లుల్లోనే అక్రమ నిల్వలు, రీసైక్లింగ్ !


నాగాయలంకలో రాత్రిళ్లు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

నాగాయలంక: మండలంలోని మిల్లుల్లోనే రేషన్ బియ్యం రీసైక్లింగ్, అక్రమ నిల్వలు ఉంటున్నట్లు తెలుస్తోంది. మండలంలో అధికార కూటమికి చెందిన ఓ ముఖ్య వ్యక్తి కనుసన్నల్లోనే రేషన్ అక్రమాలు జరుగుతున్నాయని సమాచారం. గ్రామాల్లో లబ్ధిదారులు, చిన్న వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని అర్ధరాత్రి దాటాక ప్రత్యేక వాహనాల్లోఅప్పుడప్పుడు రేషన్ వాహనాల్లోనే అక్రమ రవాణాదారులే తాము ఎంచుకున్న ప్రముఖ మిల్లులకు చేరవేస్తున్నారు. అక్కడే రీసైక్లింగ్ చేస్తున్నారా.. స్థానిక మిల్లుల్లోనే నిల్వ చేసి తర్వాత మండలాలు దాటిస్తున్నారా అనేదానిపై పూర్తిస్థాయి సమాచారం రావాలి. ఎవరైనా అక్రమ రేషన్ బియ్యంతో పట్టుబడితే పీడీ యాక్టు కేసులు పెడతామని ప్రభుత్వ పెద్దలు హెచ్చరిస్తుండటంతో రేషన్ బియ్యం మాఫియా ఇలాంటి కోణం ఎంచుకున్నారని తెలుస్తోంది. సోమవారం రాత్రి ఒంటి గంట సమయంలో రెండు వాహనాల్లో అక్రమంగా వందకు పైగా రేషన్ బియ్యం కట్టలు తరలించినట్లు తీరగ్రామస్తులు చెప్పారు. దీనిపై స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్‌ను వివరణ కోరగా పీడీఎస్ డీటీతో కలసి నెలకు ఐదు చొప్పున పీడీఎస్ షాపులు, ఎండీయూ వ్యాన్‌లు తనిఖీలు చేయాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రస్తుతం అలాంటి కదలిక లుకనపడటం లేదని వివరించారు.

ఉక్కుపాదం మోపుతాం

మండలం నుంచి రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే ఉక్కు పాదం మోపుతున్నామని నాగాయలంక ఎస్.ఐ కలిదిండి రాజేష్ వివరించారు. మండలంలో కొంత కాలంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాను తరచూ అడ్డుకుని పోలీసు రెవెన్యూ వర్గాలకు సమాచారం ఇస్తున్న మండల శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్ 'సాక్షి'తో మాట్లాడుతూ అవినీతిని అరికట్టి పేద, బడుగు వర్గాలకు మేలు చేయాలని సంకల్పం తోనే మండలంలో అక్రమ రేషన్ నిరోధానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఇటీవల ఎస్పీకి రేషన్ బియ్యం అక్రమ రవాణాపై దివిసీమ పోలీసుల ఉదాశీన వైఖరిపై ఇటీవల లిఖిత పూర్వక ఫిర్యాదు కూడా చేశారు.

రోడ్డుపై గుంతలు.. ప్రజల ఇక్కట్లు

నాగాయలంక: అవనిగడ్డ, నాగాయలంక మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా గ్రామంలోని ప్రధాన తూర్పు బజారు అంతర్గత రహదారి గుంతల మయం కావడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. మత్రిపాలెం వంతెన సమీపంలో తూర్పు బజారు రోడ్డు డౌన్ కార్నర్‌లో అగాధంలా గుంత ఏర్పడినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇక్కడ సిమెంట్ రోడ్డు పగల కొట్టి ఈ డౌన్‌లో కల్వర్ట్ నిర్మించారు. అయితే పగలగొట్టిన రోడ్డు వేయకుండా వదిలేయడంతో మెయిన్‌రోడ్డు నుంచి ఈ మార్గంలోకి రావడం ప్రమాదకరంగా మారింది. వర్షం వస్తే ఒక పక్క బురద, మరోవైపు పెద్ద గుంత ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామంలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు అనుబంధమైన ప్రధాన మార్గం ఈ రోడ్డే కావడంతో గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌ను వివరణ కోరగా సిమెంట్ రోడ్డు పగలగొట్టిన తర్వాత మళ్లీ నిర్మాణం జరగలేదన్నారు. ప్రజల ఇబ్బందులు గుర్తించి పంచాయతీరాజ్ నుంచి అంచనాలు కోరి మార్చి లోగా పూర్తి చేస్తామని కార్యదర్శి చెప్పారు.


మెయిన్ రోడ్డుకు అనుసంధానంగా ఉండి ప్రమాదకరంగా మారిన నాగాయలంక తూర్పు రోడ్డు డౌన్

మెస్ చార్జీలు పెంచాలని నిరసన

పెడన: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, మెస్ చార్జీలను తక్షణం పెంచి ఆదుకోవాలని మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసన ప్రదర్శనను ఉద్దేశించి ఏఐటీయూసీ నాయకుడు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు రూ.3వేల వేతనంతో జీవిస్తున్నారన్నారు. ఇవికూడా 3, 4 నెలలకు ఒకసారి ఇస్తుండటం చాలా దారుణమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచకపోవడం వల్ల కార్మికులు అప్పులు పాలవుతున్నారని పేర్కొన్నారు. తక్షణం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి కార్మికులకు రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎండీ రఫీవుల్లాకు వినతి పత్రం అందించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘ మండల అధ్యక్షురాలు రాజారత్నం, సంఘ మండల కార్యదర్శి కట్టా రాజకుమారి, బూసం. బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి విద్య, క్రీడా పోటీలు

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా మచిలీపట్నం ప్రాంతంలోని విద్యార్థులను ప్రోత్సహించడానికి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ పలు విద్య, క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వీర్నాల వారి సంక్రాంతి స్టెమ్ క్రీడా పోటీల నిర్వాహకులు మంగళవారం తెలిపారు. హిందూ కళాశాల ఆవరణలో నిర్వాహకులు పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థులకు హిందూ కళాశాలలో చదరంగం, గణిత ఒలింపియాడ్, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తామన్నారు. పురుష, మహిళా జట్లకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 7 గంటలకు జెడ్పీ సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వరకూ త్రీకే రన్ జరుగుతుందన్నారు. నిర్వాహకులు వీర్నాల పావని, అక్కరబోయిన జయశ్రీ, సునీతపాత్రో, కృష్ణ, సురభి పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

మోపిదేవి: స్థానిక గురుకుల పాఠశాలలో ఈ నెల 5, 6 తేదీల్లో జోనల్ లెవెల్‌లో జోన్-2 పరిధిలోని క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.వీరరవి మంగళవారం మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల విద్యార్థులు(బాల, బాలికలు) విడివిడిగా పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో బాలుర ఓవరాల్ చాంపియన్‌షిప్ కాకినాడ, బాలికల విభాగంలో రాజమండ్రి పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు. ఖోఖో విభాగంలో మోపిదేవి ద్వితీయ స్థానం, షటిల్‌లో మోపిదేవి ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. బాలికల విభాగం కబడ్డీ విభాగంలో మచిలీపట్నం ద్వితీయ స్థానం, చెస్‌లో మచిలీపట్నం ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

10న పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ శిబిరం

గూడూరు: పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల కోసం జిల్లా ఖజానా అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరులో ఉచిత లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గూడూరు ఎంపీడీఓ బి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుచి సాయంత్రం 5 గంటల వరకు పెన్షనర్లు లైఫ్ సరిఫికెట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. పెన్షన్ బుక్, ఆధార్ కార్డు ఫొటో స్టాట్ కాపీలతో పాటుగా ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకురావాలని ఆమె సూచించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

దేవరకోట(ఘంటసాల): మినుము పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకొంటే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయశాఖాధికారి కె.మురళీ కృష్ణ రైతులకు తెలిపారు. ఘంటసాల మండలం దేవరకోటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీ కృష్ణ మాట్లాడుతూ మండలంలో రబీ పంటగా మినుము ఎక్కువగా సాగు చేస్తున్నారని రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు చల్లిన 21-23 రోజులలోపు కలుపు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా పంటకు చీడపీడల ఉధృతి అదుపులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, వీఏఏ బి.సత్య దేవ్, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోండి

వేములపల్లి(ఘంటసాల): రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. వేములపల్లి గ్రామంలో ఏపీ రీ సర్వే ప్రాజెక్టు గ్రామ సభ మంగళవారం నిర్వహించారు. రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీ పుష్ప, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం పీహెచ్‌సీకి కుర్చీల వితరణ

శ్రీకాకుళం(ఘంటసాల): ఘంటసాల మండలం శ్రీకాకుళం పీహెచ్‌సీకి గ్రామస్తుడు కె.కృష్ణమూర్తి కుర్చీలు వితరణగా మంగళవారం అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో వైద్యానికి వచ్చే ప్రజలు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న కృష్ణమూర్తి తన భార్య రత్నకుమారి జ్ఞాపకార్థం కుర్చీలను ఆసుపత్రి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమక్షంలో అప్పగించారు. కార్యక్రమంలో జేపీస్పీ మండల ప్రధాన కార్యదర్శి కొండవీటి శ్రీనివాస్, డాక్టర్ అనిత, హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● తొమ్మిది మంది బైండోవర్

మోపిదేవి: రాబోయే సంక్రాంతి పురస్కరించుకుని ఎలాంటి జూదాల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ శ్రీవిద్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిది మందిపై బైండోవర్ కేసు నమోదు చేసి మరోసారి జూదాల్లో పట్టుబడితే ఒక్కొక్కరికి రూ. లక్ష రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కోడిపందేలకు సంబంధించి పెదకళ్లేపల్లికి చెందిన అమృత గోపి, గండు నాగబాబు, పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నడకుదురు జగన్, మోపిదేవికి చెందిన కంబాల సుబ్బారావు, మోటుపల్లి నానిబాబు, మోటుపల్లి బాబూరావు, పేకాటకు సంబంధించి చల్లపల్లికి చెందిన బొమ్మిడి లచ్చారావు, మోపిదేవివార్పుకు చెందిన సయ్యద్ నూర్ బాషాలను బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

● అడపవారిపాలెంలో రెవెన్యూ సదస్సు

అడపవారిపాలెం(మోపిదేవి): పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం-2కు చెందిన అడపవారిపాలెంలో రెవెన్యూ సదస్సు మంగళవారం గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించారు. సదస్సులో ఆళ్ల లక్ష్మీ శకుంతల, ఆళ్ల నాగేశ్వరావుకు చెందిన భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఉప సర్పంచ్ అడప దుర్గాప్రసాద్, మండల సర్వేయర్ రామకృష్ణబాబు, ఇన్‌చార్జ్ ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

● వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు

మచిలీపట్నంటౌన్: తులసి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని కేఎస్‌హెచ్ బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆర్గనైజేషన్ ఫౌండర్, అధ్యక్షుడు బొడ్డు తులసీరామ్ మాట్లాడుతూ చలికాలం వసత గృహంలోని పేద విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు లంక వెంకటరత్నం సాయంతో దుప్పట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో మేక శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు రమేష్, వసతి గృహం వార్డెన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● 'కోడూరు' రోడ్డు నిర్మించాలని సీపీఎం పాదయాత్ర



కోడూరు: అవనిగడ్డ – కోడూరు రహదారిని వెంటనే నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం 13 కి.మీ. పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఆవుల బసవయ్య నేతలు శీలం నారాయణరావు, మధు, పోలాబత్తిన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

గూడూరు: మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేశారు. మచిలీపట్నం డివిజన్ విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు, ఆపరేషన్ ఈఈ జి.గోవిందరావుల నేతృత్వంలో 34 బృందాలుగా ఏర్పడి 27 పంచాయతీల్లో సర్వీసులను తనిఖీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన తనిఖీల్లో 2,214 గృహ, 153 వాణిజ్య, 153 సర్వీసులకు అదనపు లోడు 306 కిలో వాట్లకు రూ.7,83,900 అపరాధ రుసుంగా విధించారు.

● కళాశాలలో ముగ్గుల పోటీలు

అవనిగడ్డ: స్థానిక ఎస్వీఎల్ క్రాంతి కళాశాలలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను మండలి సుప్రియ, మాజీ ఎంపీపీ బండే వెంకటకనకదుర్గ ప్రారంభించారు. ఎస్వీఎల్ క్రాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు దుట్టా వెంకట వసుమతి, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

● నాడీ వ్యవస్థపై రాగాల ప్రభావం

మచిలీపట్నంటౌన్: పలు సంగీత రాగాల ప్రభావం మానవుని నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయని అవధూత దత్త పీఠాధీశ్వరులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ అన్నారు. మచిలీపట్నం బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో మంగళవారం నిర్వహించిన అత్రిదత్త రాగసాగర కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది.

● ఎన్‌సీసీ కేడెట్లకు ప్రాక్టికల్ పరీక్ష

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ కేడెట్లకు మంగళవారం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. హవల్దార్ నాజర్ హుస్సేన్, జితేంద్ర వార్డ్ మరేల పర్యవేక్షణలో కంపాస్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్, 0.22రైఫిల్, డ్రిల్ టెస్ట్ తదితర అంశాలపై ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. మత్తి అరుణ, చిలుకోటి రాజేష్, ఎన్‌సిసి కెడెట్లు పాల్గొన్నారు.

● పూర్వ విద్యార్థి వితరణ

పెడన:పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్‌కు పూర్వ విద్యార్థి జీవితాంతం ప్రతి నెలా రూ.వెయ్యి వితరణ ఇవ్వడానికి మంగళవారం ముందుకు వచ్చారు. పుల్లపాడు వాస్తవ్యుడు ప్రస్తుత పెనుమల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న చిత్రపు శ్రీనివాసరావు మెగా పేరెంట్స్ డే రోజున ఇచ్చిన హామీ మేరకు పాఠశాల అభివృద్ధికి ప్రతి నెల రూ. వెయ్యి విరాళంగా ఇస్తానని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ కాట్రగడ్డ నాగరాజు సమక్షంలో శ్రీనివారావు రూ.వెయ్యిని అందజేశారు.

● ఎస్ఎఫ్ఐ కృష్ణా నూతన కార్యవర్గం ఎన్నిక

మచిలీపట్నంటౌన్: నగరంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ 50వ కృష్ణాజిల్లా ఎస్ఎఫ్ఐ శాఖ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. ఈ సభలోఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ప్రేమ్ కుమార్, కార్యదర్శిగా ఎస్ సమరం, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, శ్రీరామ్, సలీమ్ తదితరులను ఎన్నుకున్నారు.

పబ్లిక్ నోటీసు

[illegible] Piramal capital & Housing Finance Limited [illegible]



ప్రగతిపథంలో పెడన

● చెరగని ముద్ర వేస్తున్న పెడన కలంకారీ వస్త్రాలు
● దూకుడు పెంచిన విద్యా, వర్తక, వాణిజ్య, వస్త్ర వ్యాపార రంగాలు

పెడన: కలంకారీకి ప్రసిద్ధి చెందింది పెడన. కృష్ణా జిల్లా కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే పెడన కలంకారీ పరిశ్రమలతోపాటు విద్యా, వర్తక, వాణిజ్య, వస్త్ర రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతోంది. గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు కేంద్ర బిందువుగా పెడన నిలిచింది.

కలంకారీ వైపే ప్రపంచం చూపు

కొన్నేళ్లుగా పెడనలో కలంకారీ వస్త్రాలు తయారు చేస్తూనే వస్తున్నారు. సహజ సిద్ధ రంగుల కోసం వనమూలికలు, వివిధ చెట్ల ఆకులు, బెరడ్లు, వేర్లు వంటి వాటిని ఉపయోగించి సహజంగా ఏర్పడే రంగులను తెల్లటి వస్త్రాలపై రంగురంగుల డిజైన్లు రూపొందించడం పెడనలో ప్రత్యేకత. అటువంటి వస్త్రాలను గతంలో తయారు చేసి ఊరూరా తిప్పి మార్కెటింగ్ చేస్తూ వచ్చారు. వ్యాపార రంగం అభివృద్ధి చెందడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వ్యాపార లావాదేవీలన్నీ పెడనలోనే ఉంటూ దేశవిదేశాల్లోమార్కెటింగ్ చేస్తుండటం విశేషం. ఎటువంటి డిజైన్లు కావాలో వారే స్వయంగా వీడియో కాల్స్ ద్వారా చూసుకోవడం, ఆన్‌లైన్‌లో బుక్ చేయడం డోర్ డెలివరీ చేయడం ద్వారా ఫోన్ పే లేదా ఆన్‌లైన్ పే మెంట్ చేస్తూ కలంకారి వ్యాపారాలను మూడు పువ్వులు ఆరు కాయాలుగా దినదినాభివృద్ధి చెందుతూ వస్తోంది. డాక్టర్ వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డుకు 2023లోఎంపికైన పిచ్చుక శ్రీనివాసరావు కలంకారి వస్త్రాల డిజైన్లలో కొత్త ఒరవడిని సృష్టిస్తూ వస్తున్నారు. కలంకారీ బ్లాక్‌లు తయారు చేయడంలో సోదరులు కొండ్రు గంగాధర్, నరసయ్యలు జాతీయ అవార్డులను అందుకున్నారు. గంగాధర్ శిల్పగురు అవార్డును సైతం అందుకున్న రంగం కలంకారి రంగమే కావడం విశేషం.


విక్రయానికి, ఎగుమతికి సిద్ధంగా కలంకారీ వస్త్రాలు


పెడన హోల్‌సెల్ అండ్ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో కొనుగోలు


నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్

దూసుకుపోతున్న విద్యారంగం

పెడన పట్టణంలో శ్రీవిశ్వభారతి, కళాంజలి వంటి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్స్‌తో పాటు మండలంలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్, పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఎటానమస్ కలిగి ఉండటం విశేషం.

వర్తక, వాణిజ్య, వస్త్ర రంగాల్లో ముందంజ

పెడన పట్టణంలో వర్తక, వాణిజ్య, వస్త రంగాలు కూడా దినదినాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. అన్ని రకాలు ఐటమ్స్ లభిస్తుండటంతో చుట్టు పక్కల మండలాల నుంచి కూడా ఇక్కడకొచ్చి కొనుగోలు చేస్తుండటం విశేషం. మొదటి నుంచి కూడా వినియోగదారులకు సరసమైన ధరలకు వస్తువులు, వస్త్రాలను విక్రయిస్తుండటంలో లక్ష్మీ టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్ వస్త దుకాణంతో పాటు పలు వర్తక దుకాణాలు అందుబాటులో ఉన్నాయి.

కలంకారికి పేరు ప్రఖ్యాతలు



కలంకారి పరిశ్రమలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు వస్తున్నాయి. గతంలో కలంకారి వస్త్రాలను తీసుకుని ఊరురా తిరుగుతూ మార్కెటింగ్ చేయడం జరిగింది. ఆ తరువాత కొన్ని వస్త్రా డిజైన్లను చూపించడానికి వెళ్లి వారు ఆర్డరు ఇచ్చిన పిమ్మట ఆయా వస్త్రాలను పంపించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం వాటన్నింటిని అధిగమించి ఆన్‌లైన్ ద్వారా వ్యాపార లావాదేవీలు నడుస్తున్నాయి.

–బొమ్మిడి వీరవెంకట వరప్రసాద్, మేనేజర్, హేమలత కలంకారి ఫ్యాబ్రిక్స్, పెడన

విద్యారంగంలో ప్రగతి



విద్యారంగంలో ప్రగతి సాధిస్తోంది. కేజీ నుంచి సాంకేతిక విద్య వరకు అందుబాటులో ఉన్నాయి. పెడనతో పాటు పరిసర ప్రాంతాల వారు కూడా ఇతర నగరాలకు వెళ్లి చదువుకునే పరిస్థితి చాలా తక్కువ. చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికంగానే చదివించుకుంటున్నారు.

–కె.దిలీప్‌కుమార్, ఎంకాం, ఎంఈడీ, పెడన